క్లుప్తంగా

సాంబన్నకు ఘననివాళి



సాంబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్ : పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క సోదరుడు సాంబన్న 26వ వర్ధంతి వేడుకలు మండలంలోని జగ్గన్నపేటలో నిర్వహించారు. సోమవారం రాష్ట్ర మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని నివాళులర్పించారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

మారిన విద్యుత్ సిబ్బంది ఫోన్ నంబర్లు

ఏటూరునాగారం : మండలంలోని విద్యుత్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది ఫోన్ నంబర్లను ఆ శాఖ ఉన్నతాధికారులు మార్చారు. ప్రజల అవసరాల నిమిత్తం ఫోన్ చేసే వినియోగదారులు ఈ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఈ అశోక్ నంబర్ 8712486764, ఏటూరునాగారం సబ్ ఇంజనీర్ 8712486771, లైన్‌మెన్ 8712486766, లైన్‌మెన్ 8712486768, 33 కేవీలైన్ సబ్ స్టేషన్ 8712486763, రామన్నగూడెం ఫీడర్ 33 కేవీ 8712486765 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఎస్సైకి సన్మానం



వాజేడు : స్థానిక ఎస్సై జక్కుల సతీష్‌ను మండల ఆటో యూనియన్ సభ్యులు సోమవారం శాలువా కప్పి సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించడంతో పాటు ఏ సమయంలో ఎలాంటి సహాయమైనా అందిస్తామని యూనియన్ సభ్యులు ఎస్సైకి తెలిపారు. సన్మానించిన వారిలో చిరంజీవి, శివ, సింహాచలం ఉన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

ములుగు రూరల్ : విద్యుదాఘాతంతో గొర్రె మృతి చెందిన సంఘటన ములుగులో సోమవారం చోటు చేసుకుంది. జిల్లాకేంద్రానికి చెందిన ముడిగె చిన్న గొర్రెలను మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గొర్రెలను రోజు మాదిరిగానే మేతకు తీసుకు వెళ్లాడు. మందలో నుంచి పక్కకు వెళ్లిన గొర్రె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిందని బాధితుడు తెలిపాడు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

ములుగు రూరల్ : నిరుపేదల కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జంపన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 231 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 59 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి హైదరాబాద్‌లోని శంకర్ కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న ఎస్సై రాజు

వెంకటాపురం(ఎం): మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై చల్లా రాజు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కిరాణా, పాన్ షాపులను జిల్లా డాగ్ స్క్వాడ్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం రహదారిపై వెళ్తున్న వాహనాలను సోదా చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలను రవాణా చేసినా, విక్రయించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

ఈసారైనా పరిష్కారమయ్యేనా ?

- మండలంలో భారీగా సమస్యలు
- రెవెన్యూ సదస్సుల్లో 1,695 అర్జీలు
- కార్యాలయంలో 400లకు పైగా ఫిర్యాదులు
- సర్వే నంబర్లు, వారసత్వ మార్పులపైనే ఎక్కువ



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు (ఫైల్)



దరఖాస్తులు ఇచ్చేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతులు

వాజేడు : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను చూస్తే మండలంలో భూ సమస్యలు భారీగా ఉన్నట్లు స్పష్టంగా కనబడుతోంది. సర్వే నంబర్లలో దొర్లిన తప్పులు, వారసత్వ పట్టాల మార్పులపై ఎక్కువగా దరఖస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల భూ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తెచ్చింది. గతంలో పేరుకుపోయి ఉన్న భూమికి సంబంధించిన సమస్యలకు భూ భారతి ద్వారా సత్వరమే పరిష్కారం లభిస్తుందని భూ యజమానులు ఆశిస్తున్నారు. ఆ ఆలోచనకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుంది. అందులో భాగంగానే మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 3 నుంచి 13 వరకు రెవెన్యూ సదస్సులు జరిగాయి. మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 1,695 దరఖాస్తులు వచ్చాయి. 3 నుంచి 13 వరకు రెవెన్యూ సదస్సులు జరుగగా కొందరు ఈ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోలేక పోయారు. వారు ఎందుకు దరఖాస్తులు చేసుకోలేదో తెలియనప్పటికి సదస్సుల ద్వారా 1,695 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు ఇవ్వలేకపోయినా వారు నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ దరఖాస్తులను ఇస్తున్నారు. ఈనెల 13న వాజేడు మండలాల్లో రెవెన్యూ సదస్సులు ముగిసినప్పటికి తమకు సంబంధించిన భూ సమస్యలపై రైతులు తమ సమస్యలను దరఖాస్తుల్లో నింపి అధికారులకు ఇస్తున్నారు. ఇలా ఇచ్చిన దరఖాస్తులు సుమారు 400లకు పైగానే వచ్చినట్లు సమాచారం. ఈ నెల 20 వరకు దరఖాస్తులను ఇవ్వడానికి సమయం ఉండటంతో ఇంకా భారీగానే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఉన్న సర్వే నంబర్ల స్థానంలో జరిగిన పొరపాట్లపై సర్వే నంబర్ల మార్పును కోరుతూ ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. అదే సమయంలో కుటుంబ వారసత్వ పట్టాల మార్పును కోరుతూ దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇంకా చిన్న చిన్న సమస్యలతో దరఖాస్తులు వచ్చాయి. కాగా ఈ దరఖాస్తుల ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేయనున్నట్లు సమాచారం. విచారణ అనంతరం ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.

పరిష్కారం లభిస్తుందని రైతుల ఆశాభావం

తమ భూములకు సంబంధించిన సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు ఇచ్చిన రైతులు తమ సమస్యకు ఈ సారైనా పరిష్కారం లభిస్తుందా? లేదా? అని చర్చించుకుంటున్నారు. ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం లభించక పోవడంతో ఈసారి భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

'భూ భారతి'తో సమస్యల పరిష్కారం

- డిప్యూటీ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ



ఏటూరునాగారం : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



వెంకటాపురం (కె) : రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పిస్తున్న రైతులు

ఏటూరునాగారం : భూ భారతి రెవెన్యూ సదస్సులో సత్వరమే పరిష్కారం లభిస్తోందని డిప్యూటీ తహసీల్దార్ రాహుల్‌చంద్రవర్మ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సుకు హాజరైన రైతుల నుంచి డిప్యూటీ తహసీల్దార్ వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూ భారతి చేపట్టి అన్ని రకాల భూ సమస్యలను తీర్చేందుకు నూతన వెబ్‌సైట్‌ను రూపొందించిందన్నారు. దీంతో అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏటూరునాగారం 58, బూటారం 16 దరఖాస్తులు సదస్సులో వచ్చాయని తెలిపారు. మంగళవారం కూడా ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోనే నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సదస్సులో వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్లు శంకర్, నవ్య, లావణ్య, నర్సింహారావు, భానుప్రకాష్, నాగేశ్వర్‌రావు, చైర్మన్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోని వారి కోసం ప్రత్యేక కౌంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం మండలంలోని అన్ని పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రెవెన్యూ కార్యాలయం దరఖాస్తుదారులతో నిండిపోయి కిటకిటలాడింది. సర్వే నంబర్లు, పేర్లు తప్పుల పడ్డ వారు, భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ కార్యాలయానికి భారీ సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తు చేసుకున్నారు.

విద్యార్థులను తీర్చి దిద్దాలి

- ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు



విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

వాజేడు : పాఠశాలకు వచ్చే ప్రతీ విద్యార్థిని తీర్చి దిద్దాలని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని నాగారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వచ్చి విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చదవడం, రాయడం, కూడికలు, తీసివేతల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రధానోపాధ్యాయుడు చింత మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ములుగు రూరల్ : టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డిని సోమవారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి శాలువా కప్పి సన్మానించారు. సన్మానించిన వారిలో నాయకులు రియాజ్ మీర్జా, వెంకటాపూర్ మండల అధ్యక్షుడు చెనసోజు సూర్యనారాయణ, నాయకులు పడాల ఓం ప్రకాష్, బండ్ల రాజయ్య తదితరులు ఉన్నారు.

నిర్మాణ పనులను నిలిపేయాలి



పనులను ఆపాలని చెబుతున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి

వాజేడు : ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ముందు నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని మే నెలలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో 4 రూములతో ఈ కాంప్లెక్స్ పనులు నడుస్తున్నాయి. కాగా సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి పనుల వద్దకు వెళ్లి మా రెవెన్యూ పరిధి స్థలంలో నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. మూడు గదుల వరకే ఎంపీడీఓ కార్యాలయం పరిధిలోని వస్తుందని నాలుగో గది తహసీల్దార్ కార్యాలయ స్థలంలోకి వస్తుందని చెప్పారు. మా పరిధిలోని స్థలంలో చేపట్టిన గది నిర్మాణ పనులను కొనసాగించవద్దని తెలుపడంతో పాటు తొలగించిన గోడను నిర్మించాలని చెప్పారు.

18న క్రీడా పాఠశాలలకు ఎంపిక పోటీలు

కాటారం/చిట్యాల/గణపురం/రేగొండ: తెలంగాణ క్రీడా పాఠశాలలో 2025–26 సంవత్సరానికి సంబంధించి 4వ తరగతిలో ప్రవేశం కోసం మండల కేంద్రంలో విద్యార్థులకు ఈ నెల 18న క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు శ్రీదేవి, ఊరుగొండ ఉప్పలయ్య, కొడెపాక రఘుపతి, ప్రభాకర్ సోమవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంల్లోని జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో చదువుతున్న బాల బాలికలు అర్హులని క్రీడల్లో నైపుణ్యత చాటిన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగో తరగతి చదవడంతో పాటు 31 ఆగస్టు 2016 నుంచి సెప్టెంబర్ 1, 2017 సంవత్సరంలో జన్మించిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. విద్యార్థులు వారి వెంట ఆధార్‌కార్డు, స్టడి సర్టిఫికెట్ తీసుకోని క్రీడలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభకు నిలయాలు ప్రభుత్వ కళాశాలలు

- ఎస్సై జక్కుల సతీష్



విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

వాజేడు: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ప్రతిభకు నిలయాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలే అని స్థానిక ఎస్సై జక్కుల సతీష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు స్వాగతం పలికే బ్యానర్లు, కరపత్రాలను ఎస్సై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్ల చరిత్ర కలిగిన కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ మండల వాసిపై ఉందన్నారు. మండలంలోని అందరు విద్యార్థులను కళాశాలలో చేర్పించి చదివించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, అధ్యాపకులు శ్రీనివాసరాజు, శీనయ్య, నర్సింగరావు,ఆదిలక్ష్మి, రాజు, కృష్ణవేణి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అనుచరులకే ఇళ్లు

- బీజేపీ నాయకుల ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న చక్రవర్తి

ఏటూరునాగారం : కాంగ్రెస్ పార్టీలో పనిచేసే నాయకులు, కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, పేద వారికి రాలేదని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండెపల్లి సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన నిరుపేదలకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులకు వారి అనుచరులకు మంజూరు చేశారన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ప్రతి ఇంటికి సగం రూపాయలు మంజూరు చేశారు. ఈ విషయాన్ని ప్రజలకు మేమే మొత్తం ఇస్తున్నట్టు కాంగ్రెస్ ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితమై పోతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి, జిల్లా కౌన్సిల్ నెంబర్ గద్దల హరిబాబు, మండల ప్రధాన కార్యదర్శులు కందడి ఎలేందర్, కర్నే సంపత్, మండల ఉపాధ్యక్షులు ఎలుకపెల్లి శ్రీను, మండల నాయకులు రవి, శ్రీధర్, రమేష్, యువ మోర్చా మండల అధ్యక్షులు పేయ్యల రాకేష్ పాల్గొన్నారు.

సన్మాన సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చంద్రమౌళి

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 19న దివ్యాంగుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు సన్మాన సభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారం పొందిన సందర్భంగా దివ్యాంగులు మంద కృష్ణ మాదిగ మీద ఎంతో అభిమానంతో చేస్తున్న సన్మాన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు దోర్నాల రాజేందర్ మాదిగ, అంతడుపుల సురేష్, బట్టువిజయ్‌కుమార్,మేకల రమేష్ మాదిగతదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

- సీడీపీఓ రాధిక



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మల్హర్: రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని మహదేవపూర్ సీడీపీఓ రాధిక అన్నారు. మండలంలోని తాడిచర్లలో సోమవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల్లో జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు వారితో అక్షరాలను సులవుగా గుర్తుపట్టేలా విద్యను ఆట పాటలతో నేర్పించనున్నట్లు వివరించారు. అంతేగాక చిన్నారులకు రక్తహీనత, పౌష్టికాహారం లోపం అధిగమించేందుకు ప్రతీ రోజు పౌష్టికాహారం అందించన్నుట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాళేశ్వరం: మండల కేంద్రంలోనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నరసయ్య తెలిపారు. ఎంపీసీలో సమీరా తబస్సుమ్ 429/470, బైపీసీలో సువైబా 431/440, సీఈసీలో షేక్ ఆయేషా 443/500, హెచ్ ఈసీలో కె రాజ్ కుమార్ 374/500, ఎంపీహెచ్‌డబ్ల్యూ లో జె రవళి 482/500 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ చెప్పారు. ప్రథమ సంవత్సరంలో 93 శాతం, ద్వితీయ సంవత్సరంలో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురానికి చెందిన సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుమారుడు మహేందర్‌తో కలిసి 2004–05 సంవత్సరంలో 10వ చదువుకున్న స్నేహితులు బాధిత కుటంబాన్ని సోమవారం పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో వైనాల మహేందర్, బల్తా రాజు, ముస్కా రాజ్ కుమార్, నామని కృష్ణమోహన్, కత్తి రాజు, మ్యాదరి రాజేందర్, పావుశెట్టి అశోక్, రత్న చిరంజీవి, బొడ్డుపల్లి సతీశ్, అచ్చ రాజయ్య, గాలి సుధాకర్, కో డిమాల శ్రీనివాస్, మంగళంపల్లి రమేశ్ ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

- తహసీల్దార్ శ్వేత



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్వేత

రేగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్వేత హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని రేషన్ డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలకు ఆహార భద్రత కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాయన్నారు. రేషన్ డీలర్లు విధిగా సమయపాలన పాటించి బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. తూకంలో ఎలాంటి మోసాలకు పాల్పడరాదన్నారు. డీలర్లు లబ్ధిదారుల నుంచి వేలి ముద్రలు తీసుకుని, బియ్యాన్ని లబ్ధిదారులకు ఇవ్వకుండా దారి మళ్లిస్తే చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే మండలంలోని ఆరుగురు డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ అబ్దుల్ రజాక్, ఆర్ఐ భరత్‌రెడ్డి, సిబ్బంది వేణు, డీలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎంఈఓ సుధాకర్



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి చిదిరాల సుధాకర్ అన్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గంపల స్వామి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ హాజరై పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ద్వారా విద్యాబోధన కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు నల్లబెల్లి రవీందర్, ఏనుగు లచ్చిరెడ్డి, పుప్పాల రాజు, ఉపాధ్యాయులు మాధవీలత, సుమన్, కత్తెరసాల మానస, బూడిద సురేందర్, పైతర అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కాటారం: భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు మండలంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం మేడిపల్లి, ఒడిపిలవంచ గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. మేడిపల్లిలో 152, ఒడిపిలవంచలో 192 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

రుద్రారంలో..

మల్హర్: మండలంలోని రుద్రారం రైతువేదికలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భూ సమస్యలపై రైతుల నుంచి 555 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. దరఖాస్తు పరిశీలన అనంతరం భూ సమస్యలు పరిష్కారిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944